# కరెంట్ కోతలను నివారించండి

- లూజ్‌లైన్లను సరిచేయండి
- ఆగ్రహించిన కల్వచర్ల గ్రామస్తులు
- విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి



కల్వచర్ల గ్రామ సబ్‌స్టేషన్ ఎదుట గ్రామస్తులు

రామగిరి, అక్టోబర్ 16 : మాటిమాటికీ కరెంట్ కోతలు విధించడంపై పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామస్తులు మండిపడ్డారు. కోతలను నివారించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. నాలుగు నెలల నుంచి తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నదని, తాము చీకట్లో ఉండాల్సి వస్తున్నదని వాపోయారు. విద్యుత్ స్తంభాల తీగలు తెగిపోతున్నాయని, ఇండ్లపై పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా లూజ్‌లైన్లను సవరించి కొత్తగా వైర్లు బిగించాలని డిమాండ్ చేశారు.

# మెరుగైన సేవలందించాలి

- ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి
- సీడీఎంఏ గౌతమ్



డంప్ యార్డును పరిశీలిస్తున్న సీడీఎంఏ వీపీ గౌతమ్

కార్పొరేషన్/కొత్తపల్లి, అక్టోబర్ 16: మున్సిపాలిటీల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేలా అధికారులు పనిచేయాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) వీపీ గౌతమ్ ఆదేశించారు. బుధవారం ఆయన కరీంనగరంలో విస్తృత పర్యటన చేశారు. మొదట నగరపాలక సంస్థను సందర్శించి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌తో కలిసి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. ఆ తర్వాత పారిశుధ్య విభాగానికి సంబంధించి చెత్త సేకరణలో చేపట్టాల్సిన వివరాలను తెలుసుకున్నారు. బస్టాండ్, తెలంగాణ చౌక్ చౌరస్తాల సుందరీకరణ పనులను పరిశీలించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తనిఖీ చేశారు. రాజీవ్‌గృహకల్ప సముదాయాలు, చింతకుంట డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించారు. బైపాస్ సమీపంలో డంప్‌యార్డును సందర్శించారు. బయోమైనింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. తర్వాత నగరపాలక సంస్థ మీటింగ్ హాల్‌లో అధికారులతో సమీక్షించి, మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్స్, ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన దరఖాస్తు ఏమైనా ఉన్నాయా లేవో పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. నగరపాలక సంస్థ ఆదాయ మార్గాలను ఇంకా మెరుగు పరచాలని కమిషనర్‌కు సూచించారు. ₹44.58 కోట్ల డిమాండ్ ప్రకారం వంద శాతం ఆస్తి పన్నులను వసూళ్లు చేయాలన్నారు. నగరంలో కొత్తగా స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలని మెప్మా అధికారులను ఆదేశించారు. నగరంలోని ట్రేడ్ లైసెన్స్ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి చింతలకుంట పరిధిలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించారు. పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకుని రావాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎస్‌ఈ రాజ్‌కుమార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్ సేఫ్టీ సిబ్బందికి ముగిసిన శిక్షణ



శిక్షణలో పాల్గొన్న సిబ్బంది

రాంనగర్, అక్టోబర్ 16: ఫైర్ సేఫ్టీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి శిక్షణ ముగిసింది. రిమోట్ సెన్సింగ్, వరద ప్రభావిత, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై 8 జిల్లాల్లోని 70 మంది సిబ్బందికి నగర శివారులోని లోయర్ మానేరు డ్యాంలో రెండ్రోజులు ట్రైనింగ్ ఇచ్చారు. కరీంనగర్ జిల్లా ఫైర్ అధికారి ఎన్.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగిన శిక్షణలో మంచిర్యాల డీఎఫ్ఓ భగవాన్‌రెడ్డి, సిరిసిల్ల, మానకొండూర్ ఫైర్ అధికారులు నరేందర్, భూదయ్య, కరీంనగర్ ఇన్‌చార్జి గుండయ్య పాల్గొన్నారు.

# 823 మంది టీచర్లు ఇన్.. 1091 మంది అవుట్

## రానున్న ఐదు నెలల్లో భారీగా ఉపాధ్యాయుల రిటైర్‌మెంట్లు



- కొత్త పంతుళ్లు వచ్చినా తీరని సమస్య
- ఇంకా 778 ఎస్జీటీ పోస్టులు ఖాళీ
- వచ్చే నెల నుంచి పెరగనున్న పదవీ విరమణలు
- వచ్చే ఫిబ్రవరి, మార్చిలోనే 559 మందికిపైగా రిటైర్
- కొత్త డీఎస్సీ లేకపోతే వచ్చే విద్యా సంవత్సరానికి కొరత తీవ్రం



**కొత్త టీచర్ల రాకతో సర్కారు బడుల్లో కొంతైనా కొరత తీరుతుందని ఆశిస్తున్న తరుణంలో అంతకుమించి రిటైర్‌మెంట్లు జరుగనుండడం నిరాశకు గురిచేస్తున్నది. తాజా గణాంకాలను చూస్తే.. కొద్ది నెలల్లోనే ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు కొత్త సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి కనిపిస్తున్నది. ఓవైపు జాయినింగ్, మరోవైపు విరమణతో ఉపాధ్యాయుల పరిస్థితి 'ఇలా రావడం.. అలా వెళ్లడం' అన్నట్టు మారుతున్నది. ప్రస్తుతం 823 మందికి పోస్టింగ్‌లు ఇవ్వగా.. వచ్చే ఐదు నెలల్లో 1091 మంది ఉపాధ్యాయులు రిటైర్ అయ్యే అవకాశమున్నది. దీంతో కొత్త పోస్టులకు మించి అదనంగా ఖాళీలు ఏర్పడనుండగా, తాజా టీచర్లను కలుపుకొని చూసినా ఇంకా 778 ఎస్జీటీ పోస్టులు ఖాళీగానే ఉండనున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం సజావుగా సాగాలంటే కొత్త డీఎస్సీ వేస్తే తప్ప ఉపాధ్యాయుల కొరత తీరదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**

కరీంనగర్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉపాధ్యాయుల కొరత తీర్చడానికి ప్రభుత్వం 2024 డీఎస్సీ నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 11,062 పోస్టుల భర్తీకి సంబంధించి జూలైలో పరీక్షలు నిర్వహించింది. వాటి ఫలితాలు వెల్లడించి, నియామక పత్రాలు అందజేసి ఈనెల 15న పోస్టింగ్‌లు ఇచ్చింది. వీరంతా తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 823 పోస్టులు భర్తీ అయ్యాయి. స్కూల్ అసిస్టెంట్లు, భాషాపండితులు, ఎస్జీటీలు, స్పెషల్ ఎడ్యుకేటర్, పీఈటీలు, స్పెషల్ ఎడ్యుకేటర్ ఎస్జీటీల పోస్టులను డీఎస్సీ ద్వారా ఎంపిక చేసి భర్తీ చేశారు. ఉమ్మడి జిల్లాలో కొత్త డీఎస్సీ ద్వారా నియమితులైన వారిని చూస్తే.. జగిత్యాల జిల్లాలో 334 మంది, కరీంనగర్‌లో 245, పెద్దపల్లిలో 93, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 151 మంది ఉన్నారు. వీరికి పోస్టింగ్‌లు ఇవ్వడంతో చాలామంది బుధవారం విధుల్లో చేరారు. మరికొంత మంది ఒకటి రెండు రోజుల్లో జాయిన్ కానున్నారు. నిజానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే చాలా బడుల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నది. ఈ సమస్యను అధిగమించడానికి కొత్త టీచర్లు వచ్చే వరకు విద్యావలంటీర్లను నియమించుకునే అవకాశం కల్పించాలని చాలా పాఠశాలల నుంచి విజ్ఞప్తులు ప్రభుత్వానికి వెళ్లాయి. పలు ఉపాధ్యాయ సంఘాలు కూడా డిమాండ్ చేశాయి. అయినా ప్రభుత్వం వలంటీర్ల విషయాన్ని పక్కన పెట్టింది. దీంతో ఉన్న ఉపాధ్యాయులే ఏదో విధంగా నెట్టుకుంటూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో తాజాగా చేరిన టీచర్ల ద్వారా కొంత మేరకు ఉపశమనం కలిగే అవకా శం ఉన్నా ఇది కూడా మూణ్నాళ్ల ముచ్చటగానే కనిపిస్తున్నది.

### వచ్చే మార్చిలోగా 1091 మంది పదవీ విరమణ

కొత్త ఉపాధ్యాయుల రాకతో సమస్య కొంత మేరకైనా తీరుతుందని భావిస్తున్న తరుణంలో రిటైర్‌మెంట్లతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చేలా కనిపిస్తున్నది. పదవీ విరమణ ప్రభావం వచ్చే నెల నుంచే భారీగా పడే అవకాశమున్నది. దీంతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి 'యథారాజా.. తథా స్థితి' అన్న చందంగానే ఉండబోతున్నది. వాస్తవానికి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు.. పదవీ విరమణ వయస్సును తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పెంచిన విషయం తెలిసిందే. గతంలో రిటైర్‌మెంట్ వయసు 58కి ఉండగా, మూడేళ్లు పెంచి 61కి చేసిన విషయం విదితమే. ఈ ఆదేశాలు 2021 మార్చి నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో మూడేళ్లపాటు నిలిచిపోయిన పదవీ విరమణలు తిరిగి గత మార్చి నుంచే ప్రారంభమయ్యాయి. ఆ మేరకు ఉమ్మడి జిల్లాలోనూ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో రిటైర్ కానున్నారు. వచ్చే నవంబర్, డిసెంబర్‌లో ప్రతి నెలా సుమారు 160 మందికిపైగా పదవీ విరమణ పొందనున్నారు. అలాగే వచ్చే యేడాది జనవరి, ఫిబ్రవరి, మార్చిలో ఒక్కో నెలలో 180 నుంచి 250కిపైగా మంది రిటైర్ కాబోతున్నారు. మొత్తంగా ఆయా జిల్లాల విద్యాశాఖ నుంచి అందుతున్న గణాంకాల ప్రకారం.. వచ్చే మార్చి నాటికి అంటే దాదాపు ఐదు నెలల్లో 1091 మందికిపైగా రిటైర్‌మెంట్ అవుతారని స్పష్టమవుతున్నది.

### ఇప్పటికే ఎస్జీటీల కొరత

2024 డీఎస్సీ ప్రకారం చూస్తే.. ఉమ్మడి జిల్లాలో మొత్తం 363 మంది ఎస్జీటీలు నియామకమయ్యారు. ఇవి పోనూ ఉమ్మడి జిల్లాలో ఇంకా 778 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాల వారీగా చూస్తే జగిత్యాల జిల్లాలో 441, కరీంనగర్‌లో 311, పెద్దపల్లిలో 158, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 231 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒకవైపు పోస్టులు భర్తీ చేయకపోవడం, మరోవైపు రిటైర్‌మెంట్లు పెరుగనుండడంతో సర్కారు బడుల్లో మళ్లీ పంతుళ్ల కొరత ఏర్పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం ఏదో రకంగా నెట్టుకొచ్చినా.. వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం నాటికి అంటే జూన్ వరకు టీచర్ల కొరత తీవ్రమవుతుందని ఉపాధ్యాయులే చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు స్పష్టమైన సమాచారం ఇచ్చి.. పటిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తే తప్ప సర్కారు బడుల్లో బోధన అవాంతరాలు తొలగిపోవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే భవిష్యత్‌లో నిర్వహించే డీఎస్సీలు ఒక వేళ ఆలస్యమయ్యే పరిస్థితులుంటే.. ముందుగా విద్యావలంటీర్లను రిక్రూట్ చేసుకునే అవకాశమిస్తే కొంతలో కొంతైనా సమస్య పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి.

### సర్దుబాటుపై దృష్టి అవసరం

ఉమ్మడి జిల్లాలో కొత్తగా 823 మంది టీచర్లు వచ్చినా.. చాలా పాఠశాలల్లో కొరత తీరే పరిస్థితి లేదు. నిజానికి విద్యార్థులున్న చోట ఉపాధ్యాయులు లేకపోవడం, ఉపాధ్యాయులున్న చోట విద్యార్థులు లేకపోవడాన్ని ప్రభుత్వం గుర్తించి గతంలోనే సర్దుబాటుకు అవకాశం కల్పించింది. అయితే ఉమ్మడి జిల్లాలో సర్దుబాటు ప్రక్రియ సజావుగా సాగలేదు. ఆయా జిల్లాల విద్యాశాఖలో పారదర్శకత లోపించడం, అలాగే రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడం దీనికి ప్రధాన కారణమని తెలుస్తున్నది. సర్దుబాటు కింద కేటాయించిన పాఠశాలల్లో తక్షణమే విధుల్లో చేరాల్సి ఉన్నా.. చాలా మంది పంతుళ్లు వెళ్లడం లేదు. రాజకీయ అండదండలతో కొంతమంది ముందుకెళ్తుంటే.. అధికారులు సైతం తమకెందుకులే అన్నట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఫలితంగా విద్యార్థులున్న స్కూళ్లలో గురువులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ విద్య సజావుగా సాగాలంటే ఇప్పటికైనా సర్దుబాటుపై మరోసారి దృష్టిసారించాల్సిన అవసరముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో ఆయా క్యాడర్ల కింద జిల్లాల్లో చేరుతున్న ఉపాధ్యాయుల వివరాలు**

| క్యాడర్లు | జగిత్యాల | కరీంనగర్ | పెద్దపల్లి | సిరిసిల్ల |
|---|---|---|---|---|
| స్కూల్ అసిస్టెంట్ | 99 | 86 | 49 | 56 |
| భాషాపండితులు | 39 | 18 | 5 | 12 |
| ఎస్జీటీలు | 161 | 114 | 21 | 67 |
| స్పెషల్‌ఎడ్యుకేటర్ (ఎస్‌ఏ) | 5 | 5 | 5 | 3 |
| పీఈటీలు | 8 | 7 | 1 | 4 |
| స్పెషల్‌ఎడ్యుకేటర్ ఎస్జీటీలు | 22 | 15 | 12 | 9 |
| మొత్తం | 334 | 245 | 93 | 151 |

**ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య వివరాలు**

| జిల్లా | పాఠశాలల సంఖ్య | విద్యార్థుల సంఖ్య | ఉపాధ్యాయుల సంఖ్య |
|---|---|---|---|
| కరీంనగర్ | 651 | 38,745 | 2,590 |
| పెద్దపల్లి | 535 | 31,200 | 2.289 |
| సిరిసిల్ల | 490 | 48,700 | 1978 |
| జగిత్యాల | 788 | 50,191 | 1,403 |
| మొత్తం | 2,464 | 1,68,836 | 8,260 |

# తీగలగుట్టపల్లి ఆర్వోబీ పూర్తయ్యేదెన్నడో..?

- రెండేళ్లలో పూర్తికి గడువు
- నిర్మాణంపై అంతులేని అలసత్వం
- ప్రారంభించి పదిహేను నెలలైనా ఇంకా పిల్లర్లకే పరిమితం
- పనులు పూర్తికాక వాహనదారులకు ఇబ్బందులు
- గంటకోసారి రైల్వే గేటు పడుతుండడంతో ట్రాఫిక్ జాం
- నిత్యం దుమ్ము, ధూళితో స్థానికులకు నరకం

**తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)పై అంతులేని అలసత్వం కొనసాగుతున్నది. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేమితో నిర్మాణం నత్తనడకన సాగుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రెండేళ్లలో కంప్లీట్ చేయడమే లక్ష్యంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పనులు ప్రారంభించగా, తర్వాత వచ్చిన సర్కారు గాలికొదిలేసింది. 15 నెలలైనా ఇంకా పిల్లర్ల దశకే పరిమితం కాగా, గేటు పడినప్పడల్లా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం దుమ్ము, ధూళితో స్థానికులు నరకం చూస్తున్నారు. ఇప్పటికైనా పనులు వేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.**

కరీంనగర్ కలెక్టరేట్, అక్టోబర్ 16: కరీంనగర్ - మంచిర్యాల రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే పెద్దపల్లి-కరీంనగర్- నిజామాబాద్ రైల్వేలైన్‌లో కరీంనగర్ జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న కరీంనగర్-తీగలగుట్టపల్లి క్రాసింగ్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి లేక వాహనదారులు ఏండ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో కొన్నేండ్లుగా రైళ్ల సంఖ్య భారీగా పెరిగింది. ఈ క్రమంలో రైలు వచ్చి వెళ్లే సమయంలో క్రాసింగ్ వద్ద గేటు వేస్తుండగా, ఒక్కోసారి రైలు వచ్చి వెళ్లడానికి సుమారు 20 నుంచి 30 నిమిషాలు పడుతుండడంతో వాహనదారులు చుక్కలు చూస్తున్నారు. ఇక్కడ ఆర్వోబీ నిర్మించాలని ఏండ్లుగా వాహనదారులు డిమాండ్ చేస్తూ వచ్చినా నెరవేరలేదు.



పిల్లర్లకే పరిమితమైన ఆర్వోబీ పనులు

### పనుల్లో నిర్లక్ష్యం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే శాఖకు పలుసార్లు లిఖిత పూర్వకంగా విన్నవించింది. ఆలస్యంగానైనా స్పందించి ఆర్వోబీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామ్యం కావాలని సూచించడంతో అప్పటికప్పుడు తన వంతు వాటా కూడా విడుదల చేసింది. ₹154 కోట్ల వ్యయంతో నాలుగు వరుసల్లో 750 మీటర్ల పొడవు, 21 మీటర్ల వెడల్పుతో వంతెన పనులు రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. 2023 జూలై 13న అప్పటి రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. ఆరునెలల పాటు శరవేగంగా కొనసాగగా, అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం, నిధుల విడుదలలో జాప్యం జరగడంతో పనులు నిలిచాయి. అయితే, ప్రస్తుత ప్రభుత్వం ఆర్వోబీ నిర్మాణంపై అంతగా దృష్టి సారించడం లేదు. గుత్తేదారు, అధికారుల నిర్లక్ష్యంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి. కనీసం పదిశాతం పనులు కూడా పూర్తి కాలేదు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా ఇటీవల సంబంధిత అధికారులతో సమీక్షించి, పనుల్లో వేగం పెంచాలని సూచించినా అది జరగలేదు. గతేడాది జూలై నుంచి సాగుతున్న పనులతో ఇప్పటివరకు కేవలం ఒకవైపు మాత్రమే పిల్లర్లు వేయడం పూర్తయింది. వీటిపై స్లాబు నిర్మాణం చేపట్టడంతో పాటు రెండో వైపు పిల్లర్లు, స్లాబు పనులు పూర్తి చేసేందుకు ఇంకెన్నాళ్లు పడుతుందో తెలియదు.

### వాహనదారులకు తిప్పలు

ఈ మార్గంలో రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిపై ఉన్న ట్రాక్ గుండా గంటకోసారి గూడ్స్ రైళ్లు వెళ్తున్నాయి. దీంతో రోజుకు కనీసం పది నుంచి పదిహేను సార్లు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, బ్రిడ్జి నిర్మాణ పరిసరాల్లో దుమ్ము, ధూళితో స్థానిక ప్రజలు నరకం చూస్తున్నారు. జిల్లాతోపాటు మంచిర్యాల, ఆదిలాబాద్, లక్సెట్టిపేట, తదితర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఒకసారి రైల్వే గేటు వేస్తే తిరిగి తీసేందుకు కనీసం పావుగంటకు పైగా సమయం పడుతున్నది. ఈలోగా ఇరువైపులా కిలోమీటర్ మేరకు ట్రాఫిక్ జాం అవుతుండగా, క్లియర్ కావడానికి కనీసం అరగంటకు పైగానే పడుతున్నది. ఒక్కోసారి అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులు ట్రాఫిక్‌లోనే మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


## కనపర్తి బ్రిడ్జి నిర్మాణానికి మోక్షమెప్పుడో?



ఆగస్టులో వీణవంక-కనపర్తి గ్రామాల మధ్య వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డు

వీణవంక, అక్టోబర్ 16 : ఏండ్లనాటి బ్రిడ్జి నిర్మాణం కల నెరవేరుతుందని.. తమ వెతలు తీరుతాయని ఆశపడ్డ ఐదు గ్రామాల ప్రజలకు నిరాశే మిగులుతున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిధులు మంజూరైనా పనుల పూర్తిపై నిర్లక్ష్యం కొనసాగుతున్నది. వీణవంక మండలంలోని కనపర్తి గ్రామం మండల కేంద్రానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వర్షాలు పడినప్పుడు ఈ గ్రామం నుంచి వీణవంకకు వెళ్లే రోడ్డు పరిస్థితి దారుణంగా మారుతున్నది. గ్రామ శివారులో పైన ఉన్న బేతిగల్ ఊరచెరువు నుంచి బంధంకుంటకు ప్రవహించే వరద తాకిడికి తెగిపోతున్నది. ఈ రోడ్డుపై రాకపోకలు నిలిచి, కనపర్తితోపాటు శంకరపట్నం మండలం కల్వల, గద్దపాక, వీణవంక మండలం బేతిగల్, వీణవంక గ్రామస్తులు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. ఇలాంటి సమయాల్లో మండల కేంద్రానికి వెళ్లాలంటే కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సి వస్తున్నది. ఈ సమస్యను గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, 2023లో బ్రిడ్జి నిర్మాణానికి ₹1.25 కోట్లు, రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ₹2.40 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే, తర్వాత ప్రభుత్వం మారడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

### వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



ఎన్నో ఏండ్ల సంది బ్రిడ్జి లేక మా ఊరోళ్లం ఇబ్బందులు పడుతున్నం. వరద వచ్చినప్పుడల్లా మండల కేంద్రానికి రాకపోకలు బంద్ అయితున్నయి. వ్యవసాయ భూములు, పంటలు దెబ్బ తింటున్నయి. మా బాధలను చూసి గత బీఆర్‌ఎస్ సర్కారు బ్రిడ్జి, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చింది. కానీ, ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. మా బాధలు అర్థం చేసుకొని వెంటనే బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

**- పర్లపెల్లి తిరుపతి (కనపర్తి)**

# బంకుల్లో 'స్మార్టుగా' మోసాలు


- 8 రకాల మోసాలను గుర్తించిన నిపుణులు
- వాహనదారుల ఏమరపాటును క్యాష్ చేసుకుంటున్న నిర్వాహకులు



రాంనగర్, అక్టోబర్ 16 : పెట్రోల్ బంకుల్లో రోజురోజుకూ మోసాలు పెరిగిపోతున్నాయి. ఇటీవల హైదరాబాద్, సూర్యపేట, నల్లగొండ, సిద్దిపేట ప్రాంతాల్లో ఘటనలు వెలుగు చూశాయి. వాహనదారులు అప్రమత్తంగా ఉంటే మోసాల బారినపడకుండా ఉండొచ్చు.. కానీ, ఏమరుపాటుతో మోసపోయే సందర్భాలెన్నో ఉన్నాయి. మోసాలను గుర్తించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తూనికలు, కొలతలశాఖ అధికారులు సూచిస్తున్నారు.

### మోసాలను పసిగట్టండి ఇలా..

- బంక్‌లో పెట్రోల్ కొట్టడం ప్రారంభించగానే 1,2,3 రీడింగ్ కనిపించకుండా నేరుగా 5,6,7,8కు జంప్ అవుతుందట. దీంతో రావాల్సిన పెట్రోల్ కన్నా తక్కువగా వస్తుంది.
- మాటల్లో పెట్టి తక్కువ ఇంధనం నింపి, ఎక్కువ డబ్బులు వసూలు చేస్తుంటారు. రూ.100 పెట్రోల్ అడిగితే అటెండెంట్ అంతకుముందు కొట్టిన రూ.50రీడింగ్ నుంచి ప్రారంభిస్తాడు. దీంతో కేవలం రూ.50 ఇంధనాన్ని మాత్రమే పొందుతారు. ఇది షార్ట్ ఫ్యూయలింగ్ మోసం.
- కార్లలో ఇంధనం నింపుకొనేవారు వాహనం కిందకు దిగరు. దీంతో రీడింగ్ మార్చకుండానే ఫిల్ చేస్తుంటారు. ఎప్పుడు పెట్రోల్ కొట్టించినా కారు దిగి మీటర్ దగ్గరికి వెళ్లి పోయించుకోవాలని సూచిస్తున్నారు.
- పెట్రోల్ పోసే వ్యక్తి మిషన్‌ను తరచుగా నిలిపివేస్తుంటే మోసం చేస్తున్నట్టుగానే భావించాలి. మిషన్ వేగంగా పనిచేస్తున్నా ఇంధనం తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. అనుమానం వస్తే పెట్రోల్‌ను పరీక్షించాలని బంక్ యజమానులను డిమాండ్ చేయాలి.
- రూ.100,200,500,1000 ఇలా రౌండ్‌ఫిగర్‌గా పెట్రోల్‌ను పోయించుకోవడంతో సులభంగా మోసం చేస్తారు. వీలైనంత వరకు రౌండ్‌ఫిగర్‌గా ఫ్యూయల్ కొట్టించుకోకూడదు.
- డిజిటల్ మీటర్లు ఉన్న పెట్రోల్ బంకుల్లో కొట్టించుకోవడం ఉత్తమం.



- మెషీన్, మీటర్ పూర్తిగా ఆగిన తర్వాతే ట్యాంక్ నుంచి నాజిల్‌ను బయటికి తీయాలని అటెండెంట్‌కు ముందుగానే చెప్పాలి.
- పెట్రోల్ కల్తీ అయినట్టు అనుమానం వస్తే వెంటనే లిట్మస్ పేపర్‌తో పరీక్షించాలి. వినియోగదారుల రక్షణ చట్టం 1986 ప్రకారం.. బంకు యాజమాన్యం లిట్మస్ పేపర్లను అందుబాటులో ఉంచాలి. లిట్మస్ పేపర్‌పై కొన్ని చుక్కల పెట్రోల్ పోస్తే అది పూర్తిగా ఆవిరైన తర్వాత ఎలాంటి మరకలూ కనిపించకపోతే అది స్వచ్ఛమైన పెట్రోల్‌గా, మరకలు ఉంటే అది కల్తీ పెట్రోల్‌గా నిర్ధారించుకోవాలి.

### బంక్ వాళ్లు మోసం చేస్తే..

పెట్రోల్ బంకుల్లో జరిగే మోసాలపై పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ లేదా సంబంధిత ఆయిల్ కంపెనీ వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు. బంకుల్లో ఉండే కంప్లయింట్ బుక్‌లోనూ ఫిర్యాదును రిజిస్టర్ చేయవచ్చు. ఆడిట్, తనిఖీల సమయంలో వాటిని సమీక్షిస్తుంటుంది.